సాక్షి
జనగామ

బుధవారం | 27 | నవంబర్ | 2024



కరాటే వీరులు..

ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకు కరాటే సాధన చేస్తున్నారు. కటా, కుమతి, కుంగ్‌-ఫూ తదితర అంశాల్లో హోరాహోరీగా పోటీపడుతున్నారు. - 8లో▸



ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$26^0/14^0$

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి, రాత్రి చల్లగాలులు వీస్తాయి.

దగ్గు..జలుబు..జ్వరం





జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

- అనారోగ్యం బారిన పడుతున్న జనాలు
- ఆస్పత్రులకు పెరుగుతున్న జ్వర పీడితులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

జనగామ: వాతావరణంలో మార్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతుండటంతో పల్లెలు, పట్టణాల్లో రోగాల తీవ్రత పెరుగుతుంది. తెల్లవారు నుంచి రాత్రి వరకు చలి వణుకు పుట్టిస్తోంది. దీనికి తోడు దోమలు స్వైర విహారం చేస్తుండటంతో మలేరియా, వైరల్ ఫీవర్ కేసులు పెరిగి పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా చలి ప్రభావంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుంది. రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో వైరల్ ఫీవర్ కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి చలి కాసింత ఎక్కువనే చెప్పుకోవచ్చు. గతేడాది చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం, చికున్‌గున్యా తదితర వ్యాధుల బారిన పడితే రెండు నుంచి మూడు రోజుల్లో తగ్గు ముఖం పట్టేది. ప్రస్తుతం వారం నుంచి పది రోజుల సమయం పడుతుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు సీహెచ్‌సీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్నాయి. అత్యవసరమని గుర్తించిన రోగులకు వైద్యులు డెంగీ, చికున్‌గున్యా, ప్లేట్‌లెట్స్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, మలేరియా తదితర రక్త పరీక్షలు చేసి, రిపోర్టు వచ్చిన తర్వాత చికిత్స చేస్తున్నారు. రిపోర్టులో ఎమర్జెన్సీ ఉంటే అక్కడే అడ్మిట్ చేసుకుని యాంటీబయాటిక్‌తో పాటు రోగానికి సంబంధించిన మందు గోలీలను ఇస్తూ చికిత్సలు చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో రోజు వారీగా 30 మంది వరకు పేషెంట్లు అడ్మిట్ అవుతున్నారు. వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్న తరుణంలో జిల్లా డ్రగ్ స్టోర్‌లో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. వారం రోజులుగా జిల్లా ఆస్పత్రికి వైరల్ ఫీవర్లు, జలుబు, దగ్గు, డయేరియా తదితర వ్యాధులతో బాధపడే పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో 9,541 మంది ఓపీలుగా తమ పేర్లను నమోదు చేసుకోగా, జ్వరం -205, డయేరియా-5, మలేరియా-6, కుక్క, కోతి కాటుకు గురైన వారు 69 మంది ఉన్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీల్లో)

తేదీ	ఉష్ణోగ్రత
22	16
23	15
24	14.5
25	14
26	13

రెండు రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చా..



చలి, జ్వరంతో కూడిన కడుపునొప్పి రావడంతో రెండు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రికి వచ్చా. వైద్యులు పరీక్షించి అడ్మిట్ చేసుకున్నారు. పొద్దున, సాయంత్రం వచ్చి చూస్తున్నారు. వైద్యం బాగానే చేస్తున్నారు. కొంచెం నయం అయింది.

- తూడి సోమక్క, వనపర్తి, లింగాలఘణపురం

మందులకు ఇబ్బంది లేదు..



జిల్లాలో మందుల కొరత లేదు. జిల్లా ఆస్పత్రి నుంచి మొదలుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. జలుబు, దగ్గు, జ్వరం ఇతర రకాల వ్యాధులు నిర్ధారణ జరిగిన సమయంలో అందుకు తగ్గట్టుగా చికిత్స జరుగుతుంది. అత్యవసరమైతే ఆస్పత్రిలోనే అడ్మిట్ చేసుకుంటున్నాం.

- డాక్టర్ గోపాల్‌రావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జ్

న్యూస్‌రీల్

విద్యార్థులు సామర్థ్యాలు పెంపొందించుకోవాలి



జనగామ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సామర్థ్యాలు పెంపొందించుకోవాలని డీఈఓ రాము అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి వి.రాజేందర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ వనరుల వినియోగం అవసరానికి తగ్గట్టు వినియోగించుకుంటే వాతావరణ సమతుల్యత దెబ్బతినడం జరగదన్నారు. ఈ పోటీలో ప్రథమ స్థానంలో అరబిందో స్కూల్ విద్యార్థిని మదియా కౌరిన్, ద్వితీయ స్థానంలో ఏకశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థిని శృతి కీర్తన నిలిచారు. ఈ కార్యక్రమంలో జి. శంకర్ రెడ్డి, బి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మెరుగు రామరాజు, సత్తయ్య, ఉమా రాణి, సిద్దులు, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి




జనగామ రూరల్: ఫైర్ నిబంధనలు పాటించని వ్యాపార, వాణిజ్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, వాణిజ్య వ్యాపార సంస్థలు కనీస ఫైర్ నిబంధనలు పాటించకపోవడంతో భారీగా ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైన పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ విభాగాలను సమన్వయం చేసి టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత



జనగామ: పట్టణంలోని కుర్మవాడలోని గుట్కా గోడౌన్‌పై మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దేవసి విక్రమ్ అనే వ్యాపారి గోడౌన్‌పై దాడులు చేయగా రూ.1.89 లక్షల విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రమ్‌ను అరెస్ట్ చేసి పట్టణ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

రుద్రేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం రుద్రేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అధ్వర్యంలో వేదపండితుడు మణికంఠశర్మ, అర్చకులు సుప్రభాత సేవ, మూలగణపతికి అభిషేకం, అలంకరణ, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కరుణాకర్‌-దీప్తి దంపతుల సౌజన్యంతో 21 రకాల పూలతో రుద్రేశ్వరుడికి లక్షపుష్పార్చన నిర్వహించారు. ఏకాదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, భజనలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

జీడికల్‌లో ఘనంగా చక్రస్నానం

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా చక్రస్నాన తంతును నిర్వహించారు. సీతారామచంద్రుల కల్యాణోత్సవ అనంతరం జరిగే కార్యక్రమంలో భాగంగా వేదపండితులు విజయసారథి, శ్రీనివాసాచార్యులు, భార్గవాచార్యుల వేదమంత్రోచ్చారణలతో అలయంపై ఉన్న జీడిగుండం, పాల గుండాల్లో చక్రస్నాన తంతును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మూర్తి, ఈఓ వంశీ, రాములు, డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.



చక్రస్నాన తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

జనగామ: భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాలులో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జనగామ ఆర్డీఓ గోపీరామ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారధి, భీమ్ శర్మలతో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విశిష్ట స్థానం కలిగి ఉందన్నారు. అంతకు ముందు కలెక్టర్ అంబేడ్కర్ చిత్రపటం, రాజ్యాంగం పుస్తకానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గిరిజన ఆశాజ్యోతి, ఉద్యమ నాయకుడు దర్తి ఆబ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కడియం, కలెక్టర్, అధికారులు

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: ఈ విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న బీసీ, ఈబీసీ, ఫ్రెష్, రిన్యూవల్ విద్యార్థులు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, దరఖాస్తు ఫారంను సంబంధిత కళాశాలలో ఇవ్వాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్

జనగామ రూరల్: రాజ్యాంగ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యతని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. మంగళవారం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయ సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరికీ సమానమైన హక్కులు, అవకాశాలు రాజ్యాంగం కల్పించిందన్నారు. విద్యార్థి దశలో ఏదైన సాధించాలంటే మనల్ని మనం నమ్ముకోవాలని, పక్కవారిని నమ్మితే విజయం సాధించలేమన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చిన భవిష్యత్‌లో రాజ్యాంగాన్ని రక్షించాల్సింన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్, సభ్యులు శ్రీహరి, జ్యోత్స్న, ప్రధానోపాధ్యాయుడు జె.లచ్చిరాం, బి.వాసు పి. రతన్ సింగ్, ఏ సరోజన, రాములు, రాజయ్య, ఉపేందర్, స్వరూప, స్వాతి, హరిచంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి విక్రమ్

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సోమన్న
- కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

జనగామ రూరల్: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల రైతు కార్మిక వ్యవసాయ కూలీల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సంసిద్ధం కావాలని, గిట్టుబాటు ధరల గ్యారంటీ చట్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపులో మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ అధ్యక్షుడు రాపర్తి రాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో సోమన్న, సుంచు విజేందర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను తీసుకువస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మి వేస్తున్నారన్నారు. అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేస్తూ రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను తక్షణమే జమ చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. కాగా ఈ ధర్నాకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మద్దతు తెలిపి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుంచి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా పోరాడుతున్న సంఘాలు ఎర్రజెండా సంఘాలు మాత్రమేనన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలిప్పించి ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, రవీందర్, ఇర్రి అహల్య, యాదలక్ష్మి, జోగు ప్రకాష్, తాండ్ర ఆనందం, మీట్యా నాయక్, అన్నబోయిన రాజు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

త్రికుటాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



త్రికుటాలయంలో కార్తీక దీపోత్సవం

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో శిథిలావస్థలో ఉన్న ముప్పేశ్వర త్రికుటాలయంలో మంగళవారం గ్రామస్తులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. కార్తీక ఏకాదశిని పురస్కరించుకొని మహిళలు కార్తీక దీపాలు వెలిగించి దైవ భక్తిని చాటుకున్నారు. శిథిలావస్థలో ఉన్న త్రికుటాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరించాలని గ్రామస్తులు, భక్తులు విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే చైతన్యవంతమైన సమాజం

కార్పొరేట్‌కు దీటుగా రెసిడెన్షియల్ భవనాలు

- ప్రజాపాలన విజయోత్సవంలో ఎమ్మెల్యే కడియం
- అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు: కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కడియం, పక్కన కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు



కళాకారుల ధూంధాం

జనగామ: విద్యతోనే చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశంలో హాలులో కలెక్టర్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన విజయోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, జనగామ ఆర్డీఓ గోపీరామ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారథి, భీమ్‌శర్మలతో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఆట, పాటల సీడీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతీ, యువకులకు 50వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. భారతదేశమంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అన్నారు. భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మనకు ఎంతో గర్వ కారణమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలతో పాటు ఇతర పథకాలను కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం: కలెక్టర్

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,29,29,323 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసినట్లు చెప్పారు. దీనికోసం ప్రభుత్వం రూ.61.57 కోట్లు లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 87,630 జీరో కరెంటు బిల్లులు జారీ చేయడం జరిగిందని, ఇందుకు రూ.19.8 కోట్ల రాయితీ పొందినట్లు తెలిపారు. రైతు రుణ మాఫీ పథకం ద్వారా 57,347 మంది రైతులకు రూ.487.13కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. గ్యాస్ లబ్దిదారులకు రూ.4.52 కోట్లు సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ ద్వారా 3750 మంది ఉచిత వైద్యం పొందారన్నారు. ఉపాధి హామీ పథకం, స్వచ్ఛతా హీ సేవా, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారులు చక్రాల రఘు బృందం సభ్యుల ధూంధాం ఆట, పాటలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'



జనగామ రూరల్: బీజేపీని బూతు స్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూతు 200 సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోని ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి, ఉడుగుల రమేష్, శివరాజ్, సోడా రమేష, దుబ్బ రాజశేఖర్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 29న చేపట్టే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని యశ్వంతపూర్‌లో జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షాదివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గం నుంచి 1000 మంది చొప్పున జనగామ చౌరస్తాలో చేపట్టే దీక్ష దివస్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే, దీక్షాదివాస్ జిల్లా ఇన్‌చార్జ్ బిక్షమయ్య, తాటికొండ రాజయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

రఘునాథపల్లి: సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని 30వ తేదీలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. సర్వేలో ప్రజలు వెల్లడించిన వివరాల్లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు మరింత వేగవంతం చేయాలని, అవరమనుకుంటే అదనంగా ఆపరేటర్లను సమకూర్చుకోవాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాస్‌లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సరిత, తహసీల్దార్ మోహ్సిన్ ముజ్తబ, మండల ప్రత్యేకాధికారి రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



సర్వే నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

కేజీకేఎస్ సదస్సును జయప్రదం చేయండి

- జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఈ నెల 30 జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా సదస్సును గౌడ కులస్తులు, కలుగీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేలు కోట్లు కేటాయించడంతో పాటు టాడి కార్పొరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. కల్లుగీత కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, గీత కార్మికులకు ఇస్తున్న పెన్షన్‌ను ఎలాంటి షరతులు లేకుండా 50 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీ గీత కార్మికుడికి వర్తింప చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. జనగామలోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే జిల్లా సదస్సుకు గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల రఘు రాములు, ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గట్టు రమేష్, ఘన్‌పూర్ సొసైటీ అధ్యక్షుడు గట్టు ఉప్పలయ్య, నాయకులు గడ్డం రాజు, బంగ్లా శ్రీను, ఇల్లందుల శ్రీను పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

16 మంది ప్యాసింజర్ గార్డుల తరలింపు

- ఆందోళనలో కాజీపేట రైల్వే గార్డులు
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

కాజీపేట రూరల్: కాజీపేట నుంచి 16 మంది రైల్వే ప్యాసింజర్ గార్డులను అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు రైల్వే గార్డులు, రైల్వే నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ తర్వాత అతిప్రధాన కాజీపేట జంక్షన్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల రైల్వే లింక్‌లను ఇతర రైల్వే డిపోలకు తరలించారన్నారు. ప్రస్తుతం కొత్తగా కాజీపేట కేంద్రంగా పని చేస్తున్న 16 మందిని వేరే రైల్వే డిపోలకు తరలించి ఈ డిపోకు ప్రాధాన్యం తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కాజీపేట డిపోలో 2024లో 17 రైల్వే గార్డుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు గుర్తించారన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ట్రెనింగ్ పూర్తయిన 18 మంది కాజీపేట రైల్వే గార్డుల్లో16 మందిని సోమవారం వేరే డిపోలకు తరలించారని తెలిపారు. కాజీపేట నుంచి ఇతర రైల్వే డిపోలకు గార్డుల తరలింపు వల్ల రైల్వేశాఖకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని, అదే 16 మంది రైల్వే గార్డులకు ఇక్కడే పోస్టింగ్ ఇస్తే రూ.16 లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆలోచించి తరలించిన గార్డులను తిరిగి కాజీపేటకు తీసుకొచ్చి రైల్వేకు ఆదాయం మిగిలేలా చూడాలని నాయకులు పేర్కొంటున్నారు.

రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్..

కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణమవుతుండగా మరో వైపు కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదిలా ఉండగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న క్రమంలో కొంత మంది రైల్వే అధికారులు కావాలని గతంలో క్రూ లింక్‌ల తరలింపు చేయగా, ఇప్పుడు గార్డుల తరలింపు చేసి కాజీపేట లో కోహైలెట్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేసే కుట్రచేస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు పట్టించుకుని రైల్వే జీఎంతో మాట్లాడాలని రైల్వే గార్డులు, నాయకులు కోరుతున్నారు.

ధిక్కరణ కేసులో తహసీల్దార్‌ను మందలించిన కోర్టు

వరంగల్ లీగల్ : కోర్టు ఆదేశాలను ఎనిమిది నెలలుగా అమలు చేయకుండా ధిక్కరించిన హసన్‌పర్తి తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉపేందర్‌రావు మంగళవారం తీవ్రంగా మందలించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ సుజాత వంశపారపర్యంగా ఉమ్మడి కుటుంబ ఆస్తిలో తన భాగం ఇవ్వాలని కోర్టులో దావా వేసింది. దీనిపై విచారణ చేసిన కోర్టు 2024 ఏప్రిల్‌లో అప్పటి జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. పిటిషన్‌దారు ఏరుకొండ సుజాతకు తన ఇరువురి సోదరులతో పాటు మూడో భాగం వాటాను పంపకం చేసి రిజిస్ట్రేషన్, పట్టా పాస్ బుక్‌లు జారీ చేయాలని హసన్‌పర్తి తహసీల్దార్‌ను ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఎనిమిది నెలలుగా ఈ తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేసిన తహసీల్దార్‌ను గతంలో తన ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. అయినా హాజరుకాకపోవడంతో మంగళవారం తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను జడ్జి ఉపేందర్‌రావు మూడు రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. విషయం తెలిసిన జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది తహసీల్దార్‌తో సహా హాజరై లిఖిత పూర్వకంగా క్షమాపణ కోరిన అనంతరం తీర్పులో భాగంగా పిటిషన్‌దారు ఏరుకొండ సుజాత వాటాను రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టా పాస్ బుక్‌లు జారీ చేశారు. ఉదయం నుంచి కోర్టు ప్రాంగణంలో ఈ విషయంపై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ దినోత్సవం రోజున మహిళలకు తమ వాటా తమకు దక్కేలా తీర్పు అమలు కావడంతో పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటే వీరులు..

ఎవరు కొడితే.. మైండ్ బ్లాక్ అయిపోతుందో.. వారే కరాటే వీరులు.. మార్షల్ ఆర్ట్స్‌కు హనుమకొండ జిల్లా కేరాఫ్‌గా మారుతోంది. ముఖ్యంగా బాలబాలికలు, మహిళల్లో కరాటే ఆత్మవిశ్వాసం నింపుతోంది. తమపై దాడి చేయాలని చూసే వారి భరతం పట్టేలా తయారవుతున్నారు. అంతేకాదు ఈ పోటీల్లో పతకాలు సాధిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ జిల్లా పేరును నిలబెడుతూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.





కాజీపేటలో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలు
- జిల్లాలో సాధన చేస్తున్న చిన్నారులు
- జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం
- శిక్షకులుగా రాణిస్తున్న యువత

కాజీపేట: జిల్లాలో ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకూ కరాటే సాధన చేస్తున్నారు. ఒకనాడు పదుల సంఖ్యలో ఉన్న సాధకులు నేడు వందల సంఖ్యలోకి చేరారు. ఫలితంగా జాతీయస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. కాజీపేట పట్టణంలో రెండుసార్లు జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన అనేక మంది సాధకులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఓడించి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. నగరంలోని అనేక క్రీడా మైదానాలతోపాటు కాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. కటా, కుమతి, కుంగ్‌-ఫూ తదితర అంశాల్లో బాలబాలికలు హోరాహోరీగా పోటీపడుతున్నారు. పదుల సంఖ్యలో కరాటే శిక్షకులు శిక్షణ అందిస్తున్నారు. కుంగ్‌ఫూ, జపాన్ షాటోఖాన్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్లు పోటీలు నిర్వహిస్తూ పిల్లలో ఆసక్తి పెంచుతున్నాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు మూడు నెలల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికలకు వారంలో మూడు రోజులు శిక్షణ ఇస్తుండడం విశేషం. వారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. ఆత్మ రక్షణకు అవసరమైన రీతిలో శిక్షణ పొందుతున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



కరాటే అంటే మాకు చాలా ఇష్టం. కుంగ్‌ఫూ మాస్టర్ పర్యవేక్షణలోనే తగిన శిక్షణ తీసుకుంటున్నాం. సెలవు రోజుల్లో ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేస్తున్నాం. మాలో ఎక్కడాలేని ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొంటామనే ధైర్యం ఏర్పడింది. గ్రీన్, ఎల్లో బెల్ట్‌లు సాధించాం.

– కొలిపాక సాత్విక, కల్యాణి, మడికొండ

అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమే..



అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమేనని గుర్తించాలి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా సునాయాసంగా ఎదుర్కొనే మొండి ధైర్యం దీని శిక్షణతో కలుగుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆటపాటలతో పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాలి. దాని వల్ల మానసికంగా, శారీరక సమస్యలు తట్టుకోవడానికి అలవాటు పడతారు.

– డి.కంలేశ్, గ్రాండ్ మాస్టర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : మహోన్నత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సంవిదాన్ దివస్ రాజ్యాంగ దినోత్సవ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి రాజ్యాంగం వినియోగంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రధానవక్త కేయూ లా కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ టి. విజయచంద్ర 'భారత రాజ్యాంగం డెమొక్రటిక్ గవర్నెన్స్' అనే అంశంపై మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం తోనే రాజకీయ ప్రజాస్వామ్యం సాధ్యమన్నారు.మన స్వేచ్ఛను సరెండర్ చేయొద్దన్నారు. సభలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి. రమ, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి. రాంచంద్రం, కేయూఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీ మొదటిగేట్ నుంచి విద్యార్థుల పాదయాత్రను వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. దూరవిద్యకేంద్రం ప్రాంగణంలోఅంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రిజిస్ట్రార్ మల్లారెడ్డి బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయించారు.

భారత రాజ్యాంగం గొప్పది

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: భారత రాజ్యాంగం గొప్పదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సీఎండీ వరుణ్‌రెడ్డి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరులకు హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.వి.ఓ బి.జనార్దన్, సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, కె.ఎస్.గుట్ట, బీకం సింగ్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షల కోసం వెళ్తే ఇల్లు గుల్ల..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు
- 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై భీమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య కారణాలతో వైద్య పరీక్షల నిమిత్తం ఓ కుటుంబం హైదరాబాద్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో నివాసం ఉండే మాజీ వార్డు సభ్యురాలు జెన్నాయికోడె శోభ, వేణుగోపాల్ దంపతులు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం ఇంటికి తాళంవేసి హైదరాబాద్ వెళ్లారు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం తమ ఇంట్లో పనిచేసే మహిళ వచ్చి చూడగా తలుపులు తీసి కనిపించాయి. దీంతో ఆమె ఆందోళన చెంది పక్కింటివారికి చెప్పగా వారు వెంటనే శోభ, వేణుగోపాల్ దంపతులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించగా ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న సెంట్రల్ లాక్ తొలగించి ఉంది. ఇంట్లోని రెండు బీరువాల్లో భద్రపరిచిన 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై భీమారెడ్డి, క్లూస్ టీం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కుమారుడికి సద్ది ఇవ్వడానికి వెళ్లి..

- బావిలో పడి గొర్రెల కాపరి మృతి



మల్లయ్య(ఫైల్)

దుగ్గొండి: గొర్రెల మంద వద్ద ఉన్న తన కుమారుడికి భోజనం అందించడానికి వెళ్లిన ఓ గొర్రెల కాపరి బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోట మల్లయ్య(60) సోమవారం రాత్రి మంద వద్ద ఉన్న తనకుమారుడికి భోజనం టిఫిన్ పట్టుకుని వెళ్తున్నాడు. అయితే మందకు కొంత దూరంలో వ్యవసాయ బావి వద్ద కాలుజారి అందులో పడ్డాడు. దూరం నుంచి గమనించిన కుమారుడు తోటి గొర్రె కాపరులతో కలిసి బావిలోకి దిగి మల్లయ్యను బయటకు తీశారు. అనంతరం దుగ్గొండి ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన మల్లయ్య మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారులు నవీన్, రాజుకుమార్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం గణపురం మండలకేంద్రంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజక వర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగం ఏర్పడి నేటికి 75 సంవత్సరాలు కావడం.. ఈ రోజే ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ సర్కారు పని చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తమ సర్కారు సంవత్సరకాలంలోనే 53 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాల కాలంలో రైతులకు రుణ మాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం ఒకేసారి రూ. 18వేల కోట్ల రుణ మాఫీని ఏక కాలంలో చేసిందన్నారు. కాగా, గణపురం నుంచి గుర్రంపేట వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కృషితో రూ. 15 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుతో పాటు మోరంచ వాగు పై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తాము ప్రజా సేవకులమని, ప్రజల కష్టాలు, సమస్యలు తీర్చడం కోసం 18 గంటల పాటు పని చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు తమ స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు 170 ఎకరాలు అప్పగించగా తాను భూమిని వెనక్కి తీసుకుని ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు గాంధీనగర్ గుట్ట మీద 60 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను, 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దొంగల ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

- సాంకేతికతను వినియోగిస్తున్న పోలీసులు



బాధితుడితో మాట్లాడుతున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఈ నెల 23వ తేదీన దావ కిశోర్ అనే వ్యక్తి ఇంట్లో జరిగిన చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. భార్య ఆస్పత్రికి.. తాను పిల్లల కోసం ట్యూషన్ వద్దకు వెళ్లి వచ్చే సరికి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు దాదాపు 35 తులాల బంగారం చోరీకి గురైనట్లు చెబుతుండగా బాధితుడు మాత్రం ఎక్కువే జరిగిందని తెలుపుతున్నాడు. దొంగలు ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనం వినియోగించినట్లు సీసీ కెమెరాల్లో కనిపించడంతో దొంగలు స్థానికుల లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా అనే అంశం అర్థం కావడం లేదు. కిశోర్‌కు తెలిసిన వాళ్లు ఎవరైనా చోరీకి పాల్పడి.. కేసును పక్కదారి పట్టించడం కోసం ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని వినియోగించి ఉంటారా అనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో సరిపోల్చుతున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు కేసు ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితోపాటు లోకల్ సీఐ, ఎస్సైలు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి దొంగలను పట్టుకోవడానికి అడుగులు వేస్తున్నారు.

కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు ఆ విభాగం అధిపతి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 'గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ప్రాసెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే అంశంపై ఈ జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వలేదంటూ..

- మాజీ ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మాజీ జెడ్పీటీసీ సారయ్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భాస్కర్ దంపతులు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య డబ్బులు ఇవ్వడం లేదంటూ సుందరయ్యనగర్‌కు చెందిన గంద్రతి భాస్కర్ దంపతులు మంగళవారం ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిల్‌తో సారయ్య ఇంటి ఎదుట బైఠాయించారు. ఏనుమాములలో సుమారు 600 గజాల భూమిని సారయ్య, భాస్కర్, రాజు కొనుగోలు చేశారు. ఈ భూమిలో మరో వ్యక్తి గృహ నిర్మాణం చేస్తుండగా అడ్డుకోవడంతో మూడేళ్ల క్రితం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ భూమికి చెల్లించిన డబ్బులు ఇస్తే కేసు విరమించుకుంటామని భాస్కర్, రాజు పోలీసులకు చెప్పడంతో సారయ్య ఇరువురికి డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అయితే డబ్బులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడిచినా చెల్లించకపోవడంతో విసిగివేసారిన భాస్కర్ దంపతులు ఆందోళనకు దిగినట్లు స్థానికులు తెలిపారు. పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనను విరమింపజేసి భాస్కర్ దంపతులను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పెద్ద మనుషులు ఇరువర్గాలతో చర్చించారు. వచ్చే నెల 10వ తేదీన సారయ్య డబ్బులు ఇవ్వాలని, ఆ డబ్బులు అతడు ఇవ్వకుంటే తాను ఇస్తానని డివిజన్‌కు చెందిన అధికార పార్టీ నాయకుడు హామీ ఇవ్వడంతో కథ సుఖాంతం అయ్యింది. ఈ విషయంపై కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ సారయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. తాను భాస్కర్‌కు ఎలాంటి డబ్బులు బాకీ లేనన్నారు. స్థలం కొనాలని భాస్కర్ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తే 10వ తేదీలోగా డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

రైతు సదస్సులో వరంగల్ మార్కెట్ స్టాల్



చపాట రకం మిర్చి



కలాసీ రకం..



వండర్‌హాట్ రకం..

వరంగల్: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రైతు సదస్సులో ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల మంగళవారం తెలిపారు. 28వ తేదీన సదస్సును మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తున్నారని, 30వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌లో చపాటా, కలాసీ (ఎల్లోకలర్ మిర్చి), వండర్‌హాట్ రకాల మిర్చి శాంపిల్స్‌ను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- వెంకటాపురంలో ఘటన



శోభన్‌బాబు(ఫైల్)

దుగ్గొండి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హింగే శోభన్‌బాబు(48)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఎన్నిసార్లు సాగు చేసిన నష్టమే తప్పా లాభం రాలేదు. ఈ క్రమంలో వ్యయసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు ఇలా మొత్తం రూ. 10లక్షల వరకు అప్పు అయ్యింది. అయితే అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మిరపతోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్ద కూతురు రవళికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో భార్య హింగే ఉమ కొంతమంది రైతులతో కలిసి బావివద్దకు వెళ్లగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే నర్సంపేటకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.